# దయానాథుడు - వేంకటనాథుడు

**డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు,**

**శ్రీ కొల్లివర్ల నాగలక్ష్మీనారాయణ**. విజయపురి.

సమస్త జననీం వన్దే
చైతన్యస్తన్యదాయినీమ్
శ్రేయసీం శ్రీనివాసస్య
కరుణామివరూపిణీమ్
కమస్య నవధిం వన్దే
కరుణా వరుణాలయమ్
వృషశైల తటస్థానాం
స్వయం వక్తి ముసాగతమ్.

భగవంతుడు అయిన శ్రీమన్నారాయణుడు కల్యాణగుణ శోభితుడు. సమస్త కల్యాణ గుణములకు ఆకరుడు. ఇలాంటి కల్యాణ గుణాలన్నీ ఈ జగత్తులో ఒకరియందే చేరి ఉండటం అసామాన్యమైన విషయం. అయితే ఆ వేళ శ్రీరామచంద్రుడు కౌసల్యాదేవి గర్భాన అవతరించబోతున్నాడు అని ఈ కల్యాణ గుణాలన్నీ ఎలాగో తెలుసు కున్నాయట. అంతే! శ్రీరామచంద్రుడు ఈ నేలపై అవతరిస్తూ ఉన్న క్షణాన అన్నీ పరుగు పరుగునా వెళ్ళి శ్రీరామచంద్రునిలో చేరి పోయాయట. దశరథాత్మజుడైన దాశరథి వెంటనే 'సమస్త కల్యాణగుణాభిరాముడు' అయి పోయాడట! అంతేగాదు సత్య పరాక్రముడైన రాముడు చలవదనంవల్ల సుఖ శీతలమైన, ప్రేమపూరితమైన చంద్రుని వంటి చల్లని చూపులవలన 'శ్రీరామ' చంద్రుడైనాడని మన పెద్దలు సెలవిచ్చారు. వాల్మీకి రామాయణంలో ఎన్నో సందర్భాలలో రాముణ్ణి రాజీవలోచనుడనీ, సత్యపరాక్రముడనీ, కల్యాణ గుణాభిరాముడనీ, దయాసముద్రుడని, ధర్మవిగ్రహుడనీ ప్రస్తావించటం జరిగింది. శ్రీపాంచరాత్ర ఆగమం కూడా భగవంతునికి జ్ఞానం శక్తి, బలం,



ఐశ్వర్యం, వీర్యం, తేజస్సు అనే ఆరు గుణాలు ఉన్నాయనీ, ఆయన అప్రాకృత దివ్యమంగళ విగ్రహుడు సర్వలోక, సర్వజన ప్రియ దర్శనుడూ, అనంత కల్యాణ గుణాకరుడు, కల్యాణ దివ్యాయుధుడనీ పేర్కొంటున్నది.

పరమపదం అని పిలువబడే శ్రీ వైకుంఠములో అనంత, గరుడ, విష్వక్సేనాది పరిజన పరిచరిత చరణ యుగళుడని ప్రవచిస్తున్నది. ఆహరివాసమే ఈనాటి శ్రీనివాసమై తిరుమలలో హరివాసముగా భాసిస్తోందనీ, ఆ శ్రీమన్నారాయణుడే నేటి ఆనంద నిలయధాముడు అని మన అన్నమాచార్యులవారు తేల్చి చెప్పినారు. భగవంతుడు అయిన నారాయణుడు అయిదు విధాలైన రూపాలతో సర్వలోకాలను పాలిస్తూ ఉంటాడట! ఆ అయిదు రూపాలే పర, వ్యూహ, విభవ, అంతర్యామి మరియు అర్చారూపాలు.

ఈనాడు తిరుమలలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారు అర్చారూపంలో భక్తకోటిని అనుగ్రహిస్తూ ఉన్నారు. ''కలౌ వేంకట నాయకః'' కలియుగంలో శ్రీ వేంకటేశుడే పరమ పదంలో వేంచేసి యుండే శ్రీమన్నారాయణుడు. ఆయన పరమ పదంలో వేంచేసియుండే స్థానాన్నే 'శ్రీవైకుంఠము' అంటారు. ''తద్విష్ణోః పరమం పదగ్ం సదా పశ్యంతి సూరయః''. ఈనాడు తిరుమల కొండపై శ్రీవారి దర్శనానికి వెళ్ళే క్యూ మార్గాన్ని శ్రీ వైకుంఠము అని అనడానికి కారణం గూడా ఇదే. దేహాంతంలో పరమపదానికి చేర్చేది ఈ 'వైకుంఠం' అనవచ్చేమో!

శ్రీ వేంకటేశ్వరస్వామివారు దయా సింధువు. ''శ్రీమన్నభీష్ట వరదాఖిల లోకబంధో! శ్రీశ్రీనివాస జగదేక దయైక సింధోః''. శ్రీనివాసునికి ఉన్న దయా గుణాన్ని శ్రీవారి పట్ట మహిషిగా భావనచేసి, శ్రీవేంకట నాథాచార్యులు అనే మహాను భావులు స్వామివారి దయా వైభవముపై అద్భుతమైన ఒక శతకాన్ని సంస్కృత భాషలో రచించారు. దాని పేరే ''దయా శతకము''. శ్రీశ్రీనివాస స్వామి మహోన్నత లక్షణమైన దయనే చేతన సమాధిలో నిలిపి శ్రీదేవిని శరణాగతికి ఉద్దేశ్యురాలిగా చేసి శ్రీవేంకటనాథుడు 'దయా శతకము' ను నడిపించినారు. ఇది ప్రపత్తి మార్గాన్ని సులభ సుందరమైన మార్గంగా చక్కగా నిరూపించడానికే ఉద్దేశించబడినది. కర్మ, జ్ఞాన, భక్తి యోగాదులను చిత్తశుద్ధితో అనుష్ఠించగల శక్తి లేనివాడననీ, నీవు తప్ప నాకు మరోగతి లేనేలేదని నీ పాదములను ఆశ్రయించిన దాసుడనై, నీకు అనుకూలుడుగా ఇక మీదట ఉంటాననీ కోరుతూ ఉంటే మన వంటి వారిని పరమ దయాళుడైన శ్రీనివాసుడు మన మొరవిని అనుగ్రహిస్తాడనీ, ప్రపత్తి ఒక్కటే సిద్ధోపాయమనీ 'దయాశతకం' నిరూపిస్తోంది.

శ్రీవేంకటనాథుడు శతాధిక గ్రంథ కర్త, శతవర్షశేఖరుడు శ్రీవేంకటేశుని అవతార దినమైన భాద్రపదమాసంలో శ్రవణా నక్షత్రం నాడు అవతరించినాడు. వారికి శ్రీరంగనాథుడు ''వేదాంతాచార్యులు'' అనీ, ''కవితార్కికకేసరీ'' అనీ బిరుదాలను అనుగ్రహించారు. అందువల్ల శ్రీవేంకటనాథుడు వేదాంతదేశికులుగా ప్రసిద్ధులు అయినారు. ఆగర్భ శ్రీమంతులై ఉండి గూడా, ఇష్టపూర్వకంగా పేదరికాన్ని ప్రేమించి, దారిద్ర్యాన్నే ధరించారు. శ్రీనివాసుని ఘంటయే వీరనీ, అపరభాష్యకార అవతారమనీ వీరిని భాగవతోత్తములు సంభావించారు. గరుడమంత్రమును జపించి, సిద్ధిపొందిన వేదాంతదేశిక స్వామివారికి గరుత్మంతుడు సాక్షాత్కరించి హయగ్రీవ మంత్రాన్ని ఉపదేశించారనీ, అది ఫలించగా వేదాంత దేశికులవారు సంస్కృత, ప్రాకృత, ద్రావిడభాషలందు ఊహాతీత ప్రతిభా విరాజిగా, సర్వలోక సమాదరులైనారు.

> ''కలౌ వేంకట నాయకః''
> కలియుగంలో
> శ్రీ వేంకటేశుడే పరమ
> పదంలో వేంచేసి యుండే
> శ్రీమన్నారాయణుడు.
> ఆయన దయా
> సముద్రుడు.

శ్రీవేదాంత దేశికస్వామివారి 'దయా శతకం' భగవంతునీ, భాగవ తోత్తముల, ఆచార్యుల, దయాపూరితమైన వైభవాన్ని చక్కగా అతిశయింపచేస్తుంది. ఎన్ని కల్యాణ గుణములున్నా ఒక్క దయాగుణమే లేనప్పుడు ఆ భగవంతునివల్ల మనకేమి ప్రయోజనము. ఒక్క దయా గుణము మాత్రము ఉండి మిగిలిన గుణములు లేకపోయిననూ ఫరవాలేదు కదా! అందువల్లనే దయారూపి అయిన శ్రీనివాసుడు, దయాదేవీ సమేతుడై మన విన్నపాలను వాత్సల్యంతో వింటూ, మహోదార భావనతో మనలను అనుగ్రహిస్తూ ఉన్నారు.

దయాశతకమునందలి ఒక పద్యం అద్భుతమైన తత్త్వప్రతిపాదితమని పెద్దలు సెలవిచ్చారు. ఇక అవధరించండి--

పరిమితఫలసంగాత్
ప్రాణినః కింపచానాః
నిగమవిపణి మధ్యే
నిత్యముక్తానుషక్తమ్
ప్రసదనమనుకంపే!
ప్రాప్తవత్యా భవత్యా
వృషగిరి హరినీలం
వ్యంజితం నిర్విశన్తి.

బుభుక్షువులైన సంసారులు క్షుద్ర పురుషార్థాలను అభిలషిస్తూ ఉంటారు. వారి పట్లకూడా దయాతరంగిణి 'దయాదేవి' అనుగ్రహవిశేషాన్ని ఈ శ్లోకం వ్యక్తపరుస్తుంది. 'ఉదారాః సర్వ ఏవైతే' ఇది ఒక విచిత్రమైన సన్నివేశాన్ని సూచిస్తుందట!

అతడు ఒక చక్రవర్తి. సర్వ విద్యా పారంగతుడు. సకల సద్గుణ వైభవ సంపన్నుడు. సర్వాంగసుందరుడు. పరమ దయానిధి విశేషించి అవివాహితుడు. ''తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ'' -- సార్వభౌముడు. ఒకనాడు తన ప్రజల చిత్తవృత్తులను పరీక్షించ దలచాడు. అతని రాజధానీ నగరంలో పెద్దవిపణి వీథిని నిర్మించాడు. అందులో శిలలతో చేయబడిన తిరగళ్ళు, రోళ్ళువంటి మొదలగు వజ్ర వైఢూర్యములవంటి అన్ని రకాల వస్తువులను ముందుకు వెళ్ళే కొలదీ వెళ్ళేకొలదీ ఉత్తరోత్తర క్రమంలో అమర్చి ఉంచాడు. అంటే ముందు శిలామయ పరికరాలు, ఇనుముతో చేయబడిన పరికరాలు, ఇత్తడి, రాగి, వెండి, బంగారు,

పీతాంబరాలు – ఇలా క్రమక్రమంగా ముందుకు వెళ్ళేకొలదీ వివిధ గదులలో అమర్చాడు.

అలా విపణి వీధిని సిద్ధంచేసి, ప్రజలందరికీ ప్రవేశార్హత కల్పించి ఒక ప్రకటన చేశాడు. 1. కుల, మత, వర్ణ, వర్గ, లింగ భేదాలతో నిమిత్తంలేకుండా ఎవ్వరైనా ఈ విపణి వీధిని దర్శించవచ్చును. 2. ఏదైనా ఒక్క వస్తువును మాత్రమే ఎవరైనా తీసుకొనవచ్చును. 3. ఆ వస్తువునకు ఏ ధర చెల్లించనక్కరలేదు. 4. విపణివీధికి తూర్పునుండి పశ్చిమానికి ఏర్పచబడింది. కనుక ప్రతిఒక్కరూ తూర్పు నుండి ప్రవేశించి, తమకు ఇష్టమైన ఏదేని ఒక్క వస్తువును మాత్రమే తీసుకొని పశ్చిమద్వారం గుండా వెళ్ళిపోవాలి. 5. ప్రవేశించినవ్యక్తి ఏదైనా ఒక వస్తువును నిర్బంధముగా తీసుకొన వలసినదే! ఊరకనే వెళ్ళరాదు, తిరిగి మళ్ళీ మరేదైనా రెండో వస్తువును గ్రహించరాదు.

ఆ విధంగా ప్రకటించి, ఆ చక్రవర్తి తన మంత్రులతో కలిసి చిట్టచివరి ద్వారం ముందు గదిలో కూర్చొని, వచ్చేపోయేవారి అభి రుచులను గమనిస్తూ వినోదిస్తున్నాడు.

మొదట ఒక గ్రామీణుడు విపణిలో ప్రవేసించాడు. తమ ఇంట్లో మంచి రోలు లేదు గనుక శిలామయమైన రోలును తీసు కొన్నాడు. ముందు ముందుకు వెళ్తూంటే 'అంతకంటే గొప్పవస్తువులు ఉన్నవికదా, అవి తీసుకోకపోతినే!' అయ్యో! తొందరపడి పోతినే అని పరమవేదన పడుతూ వెళ్ళిపోయాడు. అలాగే ఎందరో ఓర్పువహించలేక ఖిన్నులై తూర్పుద్వారం గుండా ప్రవేశించి, పశ్చిమద్వారం గుండా వెళ్ళిపోతున్నారట! ఇలాగా నవరత్నము లుండే చివరి ఆవరణం వరకూ రాగలిగిన వ్యక్తి ఏ ఒక్కడూ లేక పోయాడట!

ఇలా ఉంటే సర్వాంగసుందరి, సకల కళానిష్ణాత, సర్వాత్మ, గుణోపేత, అతి మేధావి, సర్వశాస్త్ర పారంగత, మహాపతి వ్రతా లక్షణోపేత, సర్వలోక సార్వభౌమునికి పట్టమహిషి కాగల అర్హతగలది అయిన ఒక రాచకన్యాలలామ ఆ విపణివీథిలో ప్రవేశించింది. విపణి నియమాలన్నీ ఆమె ముందుగానే తెలుసు కొనియున్నది. ఒక్కొక్క ఆవరణంలో వుండే వస్తువులను చూచికూడా అలక్ష్య భావంతోనూ, ఉదాసీనతతోనూ విస్మరించి దాటు కొంటూ అలా వెళ్ళిపోతుంది. అందరూ ఆమెవైపు విస్మయంతో చూస్తున్నారు. ఆమె అలా వెళ్ళి వెళ్ళి చివరలో తన మంత్రుల మధ్య, కూర్చొని వున్న సార్వభౌముణ్ణి సమీపించినది. ఆయన భుజంమీద చేయివేసి, ఈ విపణివీథిలో నేను కోరుకొను వస్తువుమీరే! ఈ విపణిలో ఏ వస్తువైనా తీసుకొనవచ్చునని కదా మీ ప్రకటన! మీరు ఇందులో అంతర్భూతులే కద! నేను పరి పూర్ణ శుద్ధరాలను, మీ పట్టమహిషును కావడానికి సర్వవిధములైన అర్హరాలను. మిమ్మలను కోరివచ్చినదానను. కనుక మీరు నన్ను స్వీకరించవలసినదే!'' అని విన్న వించినది.

ఆమె రూప విభవాదులకు, వాక్చతురత్వానికీ, గుణగణాలకు ఎంతో మెచ్చి, బదులు కాదనలేక మంత్రులందరి ఆమోదప్రమోదాలతో ఆమెను ఆ చక్రవర్తి పరిగ్రహించి పరిణయమాడినాడట.

ఆమెను సార్వభౌమిగా స్వీకరించ టానికి చక్రవర్తికి హేతువేమి? చక్రవర్తి ప్రక్కనే వున్న మంత్రులు, మిత్రులు, అంతరంగికులు, వీరంతా విపణి స్వరూపాన్ని చక్కగా తెలిసి నటువంటి ఆచార్య పురుషులు. వారి ఉపదేశముచే ఆకన్య విభవము విరాసాదులచే స్వాధీనపతికయై చిరకాలం పట్టమహిషిగా సంపూర్ణానందాన్ని అనుభవించినది.

వేదమే విశాలవీధి. ఆ వీధిలో కడపటి ద్వారమే వేదాంత మండపం. నిత్య ముక్తులతో సన్నిధి చేసిన ఆ సార్వభౌముడే 'నారాయణుడు'. వానిని పతిగా పొంది, వారి చరణారవింద కైంకర్యం చేయడానికి సర్వులకు అర్హతగలదు. అయితే కొందరు క్షుద్రులు ఆ వేద వీధియందు ప్రవేశించేప్పుడు పరిమిత ఫలములనే (స్వరూపస్య భావాల ప్రభావం చేత) పొంది ఎన్నో జన్మలు ఎత్తుచున్నారు. ఈ పరిమిత ఫలాపేక్షులపై దయవలన శ్రీనివాసుడు అనుగ్రహవర్షాన్ని కురిపిస్తున్నాడు. దానివలన సంసారులు విరక్తులై హరినీల రూపుడై శ్రీనివాసునిచేరి నిత్యముక్తులతో సన్నిధిచేసి యున్న శ్రీనివాస పరబ్రహ్మముని సేవించి, సంసారబంధ విముక్తులౌతున్నారు. సంసా రులు నిత్యముక్తులతో కూడిన పర బ్రహ్మమును పొందటానికి దయాదేవి అనుగ్రహమే కారణమట.

విశిష్టాద్వైత సంప్రదాయంలో పరమపురుషునికి, జీవునికీ గల నాయికా నాయకాభావము అనుభవ విదితమే కదా!

అహమస్మ్యపరాధ చక్రవర్తీ కరుణే
త్వంచ గుణేషు సార్వభౌమీ
విదుషీస్థితి మీదృశీం స్వయుమాం
వృషశైలేశ్వర పాద సత్కురుత్వమ్.